సాక్షి
చిత్తూరు
శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



నాడు నిలిపివేత.. నేడు అందజేత

టీడీపీ హయాంలో అర్హత ఉన్నా ఆపేసిన వృద్ధాప్య పింఛన్‌ను పునరుద్ధరించారు. లబ్ధిదారుడికి పింఛన్ అందజేశారు. - IIలో



నేడే మిషన్ ఆదిత్య

ఇస్రో చేపట్టనున్న ఆదిత్య ఎల్–1 ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	36	26
తిరుమల	31	21
గూడూరు	38	27
నగరి	36	25

న్యూస్‌రీల్

ఆస్పత్రుల్లో ఖాళీలకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 42 పోస్టులు ఖాళీగా ఉండగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మసిస్ట్ గ్రేడ్ -2 పోస్టులు 10, ల్యాబ్ టెక్నిషియన్ 1, కౌన్సిలర్, ఎంఎస్ గ్రేడ్-2లో ఒకటి, థియేటర్ అసిస్టెంట్ పోస్టులు 9, ల్యాబ్ అసిస్టెంట్ పోస్టులు 9, ల్యాబ్ అటెండెంట్ 3, పోస్టు మార్టం అసిస్టెంట్ పోస్టులు ఐదు, రికార్డు అసిస్టెంట్ పోస్టు ఒకటి, జనరల్ డ్యూటీ అటెండట్స్ 10, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. అభ్యర్థులు ఈనెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో చేర్చాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

గంగమ్మా.. పాహిమాం



విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే దేవతగా నీరాజనందుకుంటున్న బోయకొండ గంగమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయంలో నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. ఉదయం 10-30 నుంచి 12 గంటల మధ్య రాహుకాల సమయంలో ప్రత్యేక అభిషేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలికలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో పవిత్ర తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గణనాథునికి రూ.1.20 కోట్ల ఆదాయం



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.1.20 కోట్ల ఆదాయం లభించినట్లు దేవస్థానం ఈఓ వెంకటేశు తెలిపారు. గత 18 రోజుల హుండీ కానుకలను శుక్రవారం ఉదయం ఆలయ ఆస్థాన మండపంలో లెక్కించారు. 11 గ్రాముల బంగారం, కిలో వెండి, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.8 వేలు, విదేశీ కరెన్సీ యూఎస్‌ఏ 687 డాలర్లు, సింగపూర్ 110 డాలర్లు, మలేషియా 22 రింగిట్స్, యూఏఈ 30 దీరమ్స్, సౌది 5501 రైల్స్, కెనడా 10 డాలర్లు, ఆస్ట్రేలియా 50 డాలర్ల కానుకలతో కలిపి రూ.1.20 కోట్లు వచ్చినట్లు ఈఓ వివరించారు. దేవదాయశాఖ చిత్తూరు ఏసీ ఏకాంబరం, దేవస్థానం ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు రవి, రంగస్వామి, కోదండపాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్: జిల్లాలో అంధత్వ నివారణకు కృషి చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో కార్నియాతో బాధపడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. విటమిన్-ఏ లోపం కారణంగా చాలా మందికి చూపు మందగిస్తోందన్నారు. మధుమేహంతో చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ తరుణంలో నేత్రదానం అతిముఖ్యమైన విషయమని తెలిపారు. వీటి నివారణకు విద్యార్థులు అవగాహన కల్పించి నేత్రదానానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా చూడాలన్నారు. పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి మాధవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, డీఎంఓ శ్రీనివాసులు, ఆర్‌ఎం సంధ్య, వైద్యులు ఉషశ్రీ, అమర్‌నాథ్, పురుషోత్తం పాల్గొన్నారు.

తియ్యటి కల సాకారం

ఎస్వీ షుగర్స్ ఉద్యోగుల ఏళ్లనాటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. టీడీపీ హయాంలో 2016లో ఫ్యాక్టరీని మూసి వేయడంతో 368 కుటుంబాలు వీధిన పడ్డాయి. కంపెనీ తరఫున జీతాల బకాయిలు కూడా అందలేదు. ఎన్నోమార్లు విన్నవించుకున్నా 'బాబు'మనసు కరగలేదు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు నగరి వేదికగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎస్వీ షుగర్స్ జీతాల బకాయిలు జమ చేసి వచ్చినట్లు తెలపడంతో ఉద్యోగులు ఒక్కసారిగా ఆనందపు అంచుల్లోకి వెళ్లిపోయారు. ఒక్కో ఉద్యోగికి సర్వీసును బట్టి రూ.50 వేల నుంచి రూ.25 లక్షల వరకు వారం రోజుల్లో అందనుంది.



నగరిలో షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల బకాయిలు జమ చేసినట్లు ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ (ఫైల్)

- ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన మాట నెరవేర్చిన సీఎం
- నగరి వేదికగా ఎస్వీ షుగర్స్ జీతాల బకాయిలు జమ చేసిన సీఎం
- గతంలో ఉద్యోగుల కష్టాలను పట్టించుకోని చంద్రబాబు
- ఫ్యాక్టరీ ఖాతాకు జమ అయిన రూ.21 కోట్ల బకాయి నిధులు
- 368 కుటుంబాల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

నగరి : ఎస్వీ షుగర్స్ జీతాల బకాయిలు జమ చేసినట్లు గత సోమవారం నగరి సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో 368 మంది ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. రూ. 21 కోట్ల బకాయిలు ఫ్యాక్టరీ ఖాతాకు చేరాయి. ప్రజాసంకల్ప యాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి వీధిన పడిన ఉద్యోగులు సమస్యను విన్నవించారు. టీడీపీ ప్రభుత్వం ఫ్యాక్టరీని మూసివేసి తమను కష్టాల పాలు చేసిందని, మహానేత వైఎస్సార్ ప్రభుత్వం రాగానే ఫ్యాక్టరీని తెరిపించి మా కష్టాలు తీర్చారని వివరించారు.

బాబు హయాంలో ఇలా..

ఉద్యోగ భద్రత ఉందంటూ నిశ్చింతగా బతుకు బండిని నడుపుతూ వచ్చిన ఎస్వీ షుగర్స్ ఉద్యోగులను 2016లో టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఒక్కసారిగా అంధకారంలోకి నెట్టేసింది. అప్పటివరకు గౌరవప్రదమైన ఉద్యోగులుగా ఉన్నవారందరూ ఒక్కసారిగా నిరుద్యోగులయ్యారు. ఫ్యాక్టరీ తరఫున రావాల్సిన జీతాల బకాయిలు కూడా అందలేదు. దీంతో వారంతా జీవన గమ్యం తెలియని అయోమయంలోకి వెళ్లిపోయారు. 368 కుటుంబాలు వీధిన పడ్డాయి. వేరే ఉద్యోగాలు దొరికేంత వరకు అప్పులు చేయాల్సి వచ్చింది. బకాయిల కోసం పోరాటం చేశారు. చేసిన అప్పులపై వడ్డీలు అంటూ ఒకవైపు పెరుగుతూ పోతుండగా, మరోవైపు తమ జీతాల బకాయిలు రాకపోదా అప్పులు తీర్చివేసి నిశ్చింతగా ఉండలేమా అన్న ఆశతో ఎదురుచూపులతో గడిపారు. న్యాయం చేయాలంటూ వినతులు పట్టుకుని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎనిమిది సార్లు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసినా వారి సమస్య ఆయన చెవికెక్కలేదు.

ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే జీతాల బకాయిలు చెల్లిస్తామంటూ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వంలోకి రాగానే వీరి సమస్యపై అధ్యయనం మొదలైంది. రెండేళ్లు కోవిడ్ విపత్కర పరిస్థితులు ఉండడంతో అధ్యయనం పూర్తికాలేదు. కోవిడ్ నుంచి సాధారణ పరిస్థితికి రావడంతో జిల్లా మంత్రుల ద్వారా ఉద్యోగులు ముఖ్యమంత్రికి తమ సమస్యను వివరించుకున్నారు. ప్రభుత్వంపై ఆర్థికభారం ఎక్కువైనా ఇచ్చిన మాటపై జగన్‌మోహన్‌రెడ్డి నిలబడ్డారు. 2022 ఏప్రిల్ నాటికి విరమణ చెందే ఉద్యోగులు పోగా మిగిలిన వారందరికీ వాలంటరీ రిటైర్‌మెంట్ ప్రకటించి ఏడేళ్లకు ఉద్యోగుల జీతాల బకాయిలను అందిస్తామని తెలిపారు. ఇచ్చిన మాట మేరకు నగరిలో 'విద్యా దీవెన' ప్రారంభ వేదికగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎస్వీ షుగర్స్ ఉద్యోగుల జీతాల బకాయిలు జమ చేసి వచ్చినట్లు ప్రకటించడంతో ఉద్యోగుల కళ్లలో ఆనందాలు వెల్లివిరిశాయి. దైవం మానవరూపేణా అంటూ ముఖ్యమంత్రి చేసిన సాయానికి వారు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. జీవితాంతం తాము ఆయనకు రుణపడి ఉంటామని చెబుతున్నారు.

దైవం జగన్ రూపేణా



ఎస్వీ షుగర్స్ ఉద్యోగులకు దైవం జగన్‌మోహన్ రెడ్డి రూపంలోనే కనిపిస్తున్నారు. ఫ్యాక్టరీలో 30 సంవత్సరాలు ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేశా. 2016లో మూతబడింది. అప్పటి నుంచి బకాయిలకోసం తిరుగుతూనే ఉన్నాం. నేటికి మా కష్టం నెరవేరింది. చెప్పలేనంత ఆనందంగా ఉంది.

–యుగంధర్ రెడ్డి, తిరుమణ్యం(వడమాలపేట)

మాట నిలబెట్టుకున్న సీఎం




ప్రజా సంకల్ప యాత్రలో జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. నేను ఫ్యాక్టరీలో 35 సంవత్సరాలు డ్రైవర్‌గా పనిచేశా. ఏడు సంవత్సరాల జీతాల బకాయిలు, పీఎఫ్, గ్రాట్యుటీ నాకు అందనుంది. మా కష్టాలను తీర్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి మేలు ఎప్పటికీ మరువం.

–ఎస్.కృష్ణయ్య, వడమాలపేట

మరుపురాని మహానేత

- చిత్తూరు రచ్చబండకు వస్తూ.. అనంతలోకాలకు
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

2009 సెప్టెంబర్ 2వ తేదీ తెలుగుజాతి తీవ్ర దిగ్భ్రాంతికి గురైన రోజు.. అన్నదాతలు కన్నీరు పెట్టిన రోజు.. అక్క చెల్లెమ్మలు విలపించిన రోజు.. అవ్వాతాతలు ఆవేదనకు గురైన రోజు.. పేదల పెన్నిధి తిరిగిరాని లోకాలకు తరలిపోయిన రోజు.. రైతు బాంధవుడు లేడని, అపర భగీరథుడు ఇక రాడని వేలాది గుండెలు ఆగిపోయిన రోజు.. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన మహనీయుడు దివికేగిన రోజు.. కరువు నేలను సస్యశ్యామలం చేసిన నిత్య కృషీవలుడు కన్నుమూసిన రోజు.. ప్రజల ముంగిటకే పాలన అంటూ "రచ్చబండ" కోసం చిత్తూరుకు వస్తూ నిష్క్రమించిన రోజు. నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకాలు..



చిత్తూరు రూరల్: సంక్షేమానికి సరికొత్త భాష్యం చెప్పిన నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలు ఎలా ఉపయోగించుకుంటున్నారో ? తెలుసుకోవాలనే తపనతోపాటు అధికారుల పనితీరు, వారిలో మరింతగా జవాబుదారీతనం తీసుకురావాలన్న లక్ష్యంతో 'రచ్చబండ' కార్యక్రమానికి 2009 సెప్టెంబర్2న శ్రీకారం చుట్టారు. చిత్తూరు మండలంలోని అనుప్పల్లెలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రావాల్సిన వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దూరమయ్యారు. 'మేమేమి పాపం చేశామని.. మా ఊరికి రాకుండా వెళ్లిపోయావు రాజన్నా' అంటూ ఇప్పటికీ ఆ ఊరి ప్రజలు వైఎస్సార్‌ను తలచుకుంటూ శోకిస్తున్నారు.

ప్రాజెక్టులతో పశ్చిమం సస్యశ్యామలం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- టీడీపీ కుయుక్తులతో ప్రాజెక్టుల నిర్మాణం ఆపుదల
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సదుం: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేదికపై ఎంపీ రెడ్డెప్ప

సదుం: మూడు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే జిల్లాలోని పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు కరువు కాటకాలతో పడుతున్న ఇబ్బందులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగా, హంద్రీ–నీవా జలాలతో మూడు ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారని చెప్పారు. కానీ చంద్రబాబు కుయుక్తులతో సుప్రీంకోర్టు స్టే ద్వారా అడ్డుకున్నారని విమర్శించారు. త్వరలోనే తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని, ఎన్నికలోపు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమల మండలంలో నిర్మిస్తున్న ఆవులపల్లె ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే సోమల, సదుం, పీలేరు, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు సాగు, తాగు నీటి ఇబ్బందులు తొలుగుతాయని చెప్పారు. పుంగనూరు మండలంలోని నేతిగుట్ట ప్రాజెక్ట్, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ముదివేడు ప్రాజెక్ట్ పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

గండికోట జలాశయం నుంచి పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పైప్‌లైన్‌ల ద్వారా తాగునీరు అందిస్తామని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఇందులో భాగంగా ప్రతి కుగ్రామంలోనూ 20 వేల లీటర్ల సామర్థ్యంతో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు.

ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ఎవరి సిఫారసు అవసరం లేకుండా అర్హత, పేదరికం ప్రామాణికంగా పథకాలను పారదర్శకంగా మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు సంక్షేమ పథకాలను తమ బంధువులు, పార్టీ కార్యకర్తలకు, ముడుపులు చెల్లించిన వారికి మాత్రమే మంజూరు చేశారన్నారు. నేడు సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలు అర్హులకు అందుతుండడంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా బాగుపడుతున్నాయని తెలిపారు.

జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేద్దాం

సంక్షేమ పథకాలతో ప్రతికుటుంబానికి అండగా నిలుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆదరించి మళ్లీ సీఎంగా చేయాలని మంత్రి పెద్దిరెడ్డి కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజారిటీతో గెలిచేలా చూడాలని, మరిన్ని సంక్షేమ పథకాల అమలుకు, ప్రస్తుత పథకాల కొనసాగింపునకు, అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రజలు అండగా నిలవాలన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జానపద కళల కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచ్ ఉషారాణి పాల్గొన్నారు.

గృహసారథికి మంత్రి రోజా ఆర్థిక భరోసా

నగరి : ఆపదలో ఉన్న వారికి తానెప్పుడు అండగా ఉంటానని మంత్రి ఆర్కేరోజా మరోమారు నిరూపించారు. మండలంలోని తెరణి గ్రామానికి చెందిన గృహసారథి మోహన్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగృహానికి చేరుకున్నాడు. శుక్రవారం తెరణి గ్రామానికి వెళ్లిన రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా మోహన్‌ను పరామర్శించి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అధైర్య పడాల్సిన అవసరం లేదని తానున్నానంటూ భరోసా ఇచ్చారు. 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ద్వారా రూ. 50 వేల ఆర్థిక సహాయం అందించారు. సర్పంచ్ నిర్మలాడింపుల్, స్థానిక నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మోహన్‌ను పరామర్శిస్తున్న మంత్రి ఆర్కేరోజా

గుడ్ లక్ ఇస్రో!



ఇస్రో ఆదిత్య–ఎల్1 ప్రయోగం విజయవంతం కావాలని బంగారుపాళెం మండలం టేకుమంద జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఆకాంక్షించారు. వినూత్న రీతిలో కూర్చుని అభినందనలు తెలిపారు. - బంగారుపాళెం

కౌలు రైతులకు భరోసా

- జిల్లాలో 1,081 మంది కౌలు రైతులకు రూ.81 లక్షల జమ
- చిత్తూరులో వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు



రైతు భరోసా మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం(ఐదో ఏడాది, మొదటి విడత) జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా ప్రభుత్వం కౌలు రైతులకు మూడు విడతల్లో రైతు భరోసా నగదు అందజేస్తోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ రైతు పక్షపాత ప్రభుత్వమన్నారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మొదటి విడతలో చిత్తూరు నియోజకవర్గంలో 73 మంది కౌలు రైతులకు రూ.5.48లక్షలు, పూతలపట్టు నియోజకవర్గంలో 219 మంది కౌలు రైతులకు రూ. 16.43 లక్షలు, పలమనేరు నియోజకవర్గంలో 90 మంది కౌలు రైతులకు రూ.6.75 లక్షలు, కుప్పం నియోజకవర్గంలో 112 మంది కౌలు రైతులకు రూ.8.40 లక్షలు, పుంగనూరు నియోజకవర్గంలో 294 మంది కౌలు రైతులకు రూ.22.05 లక్షలు, నగరి నియోజకవర్గంలో 58 మంది కౌలు రైతులకు రూ.4.35 లక్షలు, జీడీనెల్లూరు నియోజకవర్గంలో 235 మందికి రూ.17.63 లక్షలు మొత్తం 1,081 మంది రైతులకు రూ.81.08 లక్షలను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. నగర మేయర్ అముద, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, జెడ్పీ మహిళా స్థాయి సంఘం చైర్‌పర్సన్ భారతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో అలహాబాద్ న్యాయమూర్తి


ఆలయంలో రాజీవ్ సింగ్ కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ సింగ్ శుక్రవారం దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆయన కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆలయ అధికారులు, చిత్తూరు కోర్టు అధికారులు పాల్గొన్నారు.

DRAVIDIAN UNIVERSITY
SRINIVASAVANAM, KUPPAM - 517 426.
e-Procurement Tender Notice"
Tender NIT Nos.01 & 02/DU/23-24 Dated: 14.08.2023 & 17.08.2023
Tenders are invited from 1.Registered Printing Presses for Printing and Supplying of UG, PG and Practical answer booklets 2. Registered manufacturer authorized and / or dealers / suppliers for Supplying of Automated Hematology Analyzer (Veterinary / Animals). Further details can be seen at e-procurement market place at https://www.apeprocurement.gov.in -REGISTRAR

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (APVVP)
జిల్లా వైద్యశాలల సేవల సమన్వయాధికారి వారి కార్యాలయం, పూర్వ చిత్తూరు జిల్లా
పత్రికా ప్రకటన తేది: 01-09-2023

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్), పూర్వ చిత్తూరు జిల్లా పరిధిలో గల ప్రభుత్వ ఆసుపత్రుల నందు ఖాళీగా ఉన్న పారా మెడికల్ ఇతర పోస్టులకు - 42 ఖాళీలు కాంట్రాక్టు మరియు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయుటకు దరఖాస్తులను 01-09-2023 నుండి 07-09-2023 సాయంత్రం 05.00 గంటల వరకు ఆహ్వానించడమైనది. పూర్తి వివరాలకు చిత్తూరు వెబ్‌సైట్ https://chittoor.ap.gov.in నందు పరిశీలించగలరు.

క్రమ సంఖ్య	ఉద్యోగం పేరు	ఖాళీలు సంఖ్య	రోస్టర్ విధానం GO.Ms.No.77, GA(Ser-D) Dept, Dt:02-08-2023	పోస్ట్ నింపే విధానం
1	ఫార్మసిస్ట్ గ్రేడ్-II	10	OC-5, BC-B-1, BC-D-2 EWS-1, SC-1	కాంట్రాక్టు
2	ల్యాబ్ టెక్నీషియన్	1	OC-1	కాంట్రాక్టు
3	కౌన్సెలర్/యం.యస్. గ్రేడ్-II	1	BC-A-1	అవుట్ సోర్సింగ్
4	థియేటర్ అసిస్టెంట్	9	OC-4, BC-D-2, BC-E-1, EWS-1, SC-1	అవుట్ సోర్సింగ్
5	ల్యాబ్ అటెండెంట్	3	OC-2, SC-1	అవుట్ సోర్సింగ్
6	పోస్టుమార్టమ్ అసిస్టెంట్	5	OC-1, BC-A-1, BC-D-1 BC-E-1, SC-1	అవుట్ సోర్సింగ్
7	రికార్డు అసిస్టెంట్	1	SC-1	అవుట్ సోర్సింగ్
8	జనరల్ డ్యూటీ అటెండెంట్స్ (GDA)/MNO/FNO	10	OC-6, BC-A-1, BC-E-1, ST-1, SC-1	అవుట్ సోర్సింగ్
9	ఆఫీస్ సబార్డినేట్	2	OC-1, SC-1	అవుట్ సోర్సింగ్
	మొత్తం	42		

1.దరఖాస్తులు సమర్పించవలసిన చిరునామా జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి వారి (DCHS), కార్యాలయము, జిల్లా ఆసుపత్రి చిత్తూరు. 2. దరఖాస్తులు సమర్పించుటకు తేదీలు: 01-09-2023 to 07-09-2023 upto 5 PM 3. దరఖాస్తు వివరములకు వెబ్‌సైట్: https://chittoor.ap.gov.in

సం/- జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి చిత్తూరు (మెంబర్ కన్వీనర్ డి.యస్.సి)

సం/-కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్ & ఛైర్మెన్ జిల్లా సెలక్షను కమిటీ, చిత్తూరు

ఆదిత్యుడిపై అధ్యయనం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సత్తా చాటుతోంది. దేశ ప్రతిష్ట ఇనుమడించేలా నూతన ప్రయోగాలకు శ్రీకారం చుడుతోంది. ఇటీవలే చంద్రయాన్-3 ద్వారా జాబిలిపై కాలుమోపింది. ప్రస్తుతం ఆదిత్య-ఎల్1తో సూర్యుడి రహస్యాల ఛేదనకు సన్నద్ధమైంది. సౌరగోళంలో వాతావరణాన్ని అధ్యయనం చేసేందుకు పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా ఉపగ్రహ ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది.

- సౌరగోళంపై పరిశోధనలకు సిద్ధమైన ఇస్రో
- పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా ఆదిత్య-ఎల్1
- నేడే శ్రీహరి కోట షార్ నుంచి ప్రయోగం
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన శాస్త్రవేత్తలు


సూర్యుడిపై అధ్యయనం చేసే 1480.7 కేజీల ఆదిత్య ఎల్1 ఉపగ్రహం

తిరుపతి సైన్స్ సెంటర్‌లో లైవ్ స్క్రీనింగ్

తిరుపతి కల్చరల్ : శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శనివారం ప్రయోగిస్తున్న ఆదిత్య ఎల్1 మిషన్ ఉపగ్రహ ప్రయోగాన్ని సందర్శించేందుకు సైన్స్‌సెంటర్‌లో లైవ్ స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం ఈ మేరకు రీజనల్ సైన్స్‌సెంటర్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ మాట్లాడుతూ శనివారం ఉదయం 11 గంటలకు నుంచి లైవ్ స్క్రీనింగ్ ఉంటుందని, మధ్యాహ్నం 12 గంటలకు ఆదిత్య ఎల్1 మిషన్‌పై ప్యానెల్ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు, అన్ని పాఠశాలల విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు సైన్స్ సెంటర్ విద్యా విభాగం 0877-2286202, 7989694681 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సూళ్లూరుపేట : సౌరగోళంలో గాలులు, జ్వాలలు, రేణువుల తీరుతెన్నులపై పరిశోధనలకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ప్రయోగించనుంది. 1480.7 కిలోల ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారా శనివారం ఉదయం 11.50 గంటలకు ప్రయోగించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉపగ్రహం ప్రయోగం ద్వారా సూర్యుడిపై దాగి వున్న రహస్యాలను ఛేదించనున్నారు. సౌర తుఫాన్ సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. దీంతో పాటు కాంతిమండలం (ఫోటోస్పియర్), వర్ణ మండలం (క్రోమోస్పియర్)లపై అధ్యయనం చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సూర్యుడిపై అధ్యయనానికి ఇస్రో మొట్టమొదటిసారిగా ఈ ప్రయోగం చేపట్టింది.

పరిశోధనలకు 'పేలోడ్స్'

ఆదిత్య ఎల్1 ఉపగ్రహంలో ఏడు పేలోడ్స్ అమర్చి పంపుతున్నారు. 1,231 కేజీలు ద్రవ ఇంధనంతో ఉపగ్రహం నింపబడింది. మిగిలిన 249 కేజీలు పేలోడ్స్ బరువు వుంటుంది. ఉపగ్రహాన్ని సూర్యుడి వైపు తీసుకెళ్లేందుకు ద్రవ ఇంధనం అవసరం . మొదట ఉపగ్రహాన్ని భూ మధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత భూమికి 15 లక్షలు కిలోమీటర్లు దూరంలోని లాగ్రేంజియన్ బిందువు-1 (ఎల్-1)లోకి చేరవేయడానికి 175 రోజులు పడుతుంది. ఆదిత్య ఎల్-1 ఉపగ్రహంలో సూర్యుడిపై అధ్యయనం చేయడానికి యాస్‌పెక్స్, సూట్, వెల్సీ, హెలియోస్, పాపా, సోలెక్స్, మాగ్ అనే ఏడు ఉపకరణాలు (పేలోడ్స్) అమర్చారు.

- 170 కేజీల బరువు గల విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ (వెల్సీ) అనే పేలోడ్ ద్వారా సౌర వాతావరణం ఎందుకు వేడిగా వుంటుంది. సూర్యుడిలో మార్పులు, అంతరిక్ష వాతావరణం, భూమి వాతావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే విషయాలపై పరిశోధనలు చేస్తుంది.
- సౌర అతినీలలోహిత ఇమేజింగ్ టెలిస్కోప్ (సూట్) అనే పేలోడ్ 35 కేజీల బరువు వుంటుంది. 200-400 ఎన్ఎం తరంగదైర్ఘ్యం పరిధి మధ్య సూర్యుడిని గమనిస్తుంది. ఇందులో 11 ఫిల్టర్లను ఉపయోగించడం ద్వారా సౌర వాతావరణంలో వివిధ పొరల పూర్తి డిస్క్ చిత్రాలను అందిస్తుంది.

ఇది సూర్యుడ్ని నిరంతరం గమనిస్తూనే వుంటుంది. ఇస్రో ఇతర సంస్థల సహకారంతో పుణేలోని ఇంటర్-యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ నుంచి ఏఎస్ రామ్ ప్రకాష్, దుర్గేష్ త్రిపాఠి నేతృత్వంలో ఈ పేలోడ్‌ను అభివృద్ధి చేశారు.

- ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పర్‌మెంట్ (యాస్‌పెక్స్) అనే పేలోడ్ ద్వారా సౌర గాలి వైవిధ్యం, లక్షణాలను తెలియజేయడమే కాకుండా దాని వర్ణ పటం లక్షణాలను అధ్యయనం చేస్తుంది.
- ఆదిత్య ప్లాస్మా ఎనలైజర్ ప్యాకేజీ (పాపా) సౌరగాలి కూర్పు దాని శక్తి పంపిణీని అర్థం చేసుకోవడానికి పరిశోధన చేస్తుంది.
- సోలార్ ఎనర్జీ ఎక్స్-రే స్పెక్ట్రోమీటరు (సోలెక్స్) సోలార్ కరోనా సమస్యాత్మకమైన కరోనల్ హీటింగ్ మెకానిజాన్ని అధ్యయనం చేయడానికి, ఎక్స్-రే మంటలను పర్యవేక్షించడానికి పరిశోధనలు చేస్తుంది.
- హై ఎనర్జీ ఎల్1 ఆర్బిటింగ్ ఎక్స్-రే స్పెక్ట్రోమీటర్ (హెలియోస్) సౌర కరోనాలో డైనమిక్ ఈవెంట్‌లను గమనించడానికి, విస్ఫోటనం..సంఘటనల సమయంలో సౌరశక్తి కణాలను వేగవంతం చేయడానికి ఉపయోగించే శక్తిని అంచనా వేస్తుంది.
- మ్యాగ్ అనే ఈ పేలోడ్‌ను మాగ్నోమీటర్ అని కూడా అంటారు. ఆదిత్య ఎల్1 ఉపగ్రహానికి ఆన్‌బోర్డు ఉపకరణంగా అమర్చి పంపుతున్నారు. ఇది ఉపగ్రహానికి సంబంధించి సమాచారాన్ని అందించేందుకు వినియోగిస్తారు.


వెల్సీఅనే పేలోడ్


సూట్ అనే పేలోడ్


సోలెక్స్ అనే పేలోడ్


హెలియోస్ అనే పేలోడ్


మాగ్ అనే పేలోడ్

పకడ్బందీగా

ఆడుదాం ఆంధ్రా


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను సమష్టిగా విజయవంతం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలకు సంబంధించి సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు వాట్సప్ గ్రూపులు క్రియేట్ చేయాలన్నారు. మండల స్థాయిలో వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది, హెడ్‌మాస్టర్, టెక్నికల్ కమిటీ, పీఈటీలను గ్రూపుల్లో చేర్చాలని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవోలు, గ్రౌండ్ ఇన్‌చార్జిలు, ఈవోపీఆర్డీలు, ఇంజినీరింగ్ అధికారులు ఉండాలన్నారు. అన్ని గ్రూపుల్లో టెక్నికల్ సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డీఈవో విజయేంద్రరావు, జిల్లా యువజన అధికారి మురళీ కృష్ణ, చీఫ్‌కోచ్ బాలాజీ, డీపీవో లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మలేరియా, డెంగీ కేసులు

జిల్లాలో మలేరియా 4, డెంగీ 42 కేసులు నమోదైనట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ నివారణకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 1,97,913 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 42 వేల మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి, డీఎంవో శ్రీనివాసులు, డీపీఎం హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మేస్త్రీ ఆత్మహత్య

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో మనస్తాపంతో మేస్త్రీ కృష్ణమరాజు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్లూరు పోలీసుల కథనం మేరకు.. కల్లూరులోని పులిచెర్ల రోడ్డులో నివాసం ఉంటున్న కృష్ణమరాజు(42) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. తాగుడుకు బానిసయ్యాడు. గురువారం భార్య కవిత ఈ విషయమై నిలదీసింది. ఎంతచెప్పినా వినకపోవడంతో పులిచెర్లలోని పుట్టింటికి వెళ్లింది. ఉదయం ఇంటికి వచ్చింది. ఎంత సేపు తలుపు తట్టినా భర్త తీయలేదు. కిటికీలో నుంచి చూడగా భర్త ఉరికి వేలాడుతున్నాడు. వెంటనే ఆమె చుట్టు పక్కల వారికి తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందికి దించి, పోస్టు మార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ విశ్వనాథ్ తెలిపారు.

నాడు నిలిపివేత.. నేడు అందజేత

సోమల: మండల కేంద్రానికి చెందిన ఖాదర్‌బాషాకు గత టీడీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న వృద్ధాప్య పింఛన్‌ను తొలగించారు. నేడు జగనన్న ప్రభుత్వంలో పింఛన్ అందుకున్నారు. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి సమస్యపై ఆయన వినతి ఇచ్చారు. స్పందించిన వారు పెన్షన్ మంజూరు చేయించారు. ఆ వృద్ధుడికి శుక్రవారం రాత్రి పింఛన్‌ను వలంటీర్ జరీనా పుంగనూరుకు వెళ్లి అందించారు. పింఛన్‌ను పునరుద్ధరించిన మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాతల సేవలో 'పీఎస్ఎన్ రైతు ప్రపంచం'


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత నాగరాజు

వి.కోట: పంటసాగులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఏ మందులు వాడాలి.. మార్కెట్ ధరల హెచ్చుతగ్గులు వంటి అవగాహన కార్యక్రమాలను నిత్యం రైతుల ముంగిట ఉంచాలనే ఉద్దేశంతోనే పీఎస్ఎన్ రైతు ప్రపంచం అనే యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఈ చానల్ ద్వారా నిత్యం మెరుగైన వ్యవసాయ సలహాలు, సూచనలే కాక నిత్యం మార్కెట్‌లో టమాట, కూరగాయలు, పూలధరలు తెలియజేస్తామన్నారు. వ్యవసాయ అధికారులు, అనుభవజ్ఞులైన రైతుల అవగాహన కార్యక్రమాలతో నిత్యం రైతుల సేవలో ఉంటామని తెలిపారు. ఉదయం 8 గంటలకు మార్కెట్‌లోని ఉద్యాన పంటల ధరలను తెలియజేయడం, 10 గంటలకు టమాటా ధరలు, 11 గంటలకు పూల ధరలు వివరాలను అప్‌డేట్ చేస్తామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, వైస్ సర్పంచ్ అక్మల్, నాయకులు నరేంద్ర పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి


మృతి చెందిన సహన్‌సేరా

వి.కోట: మండలంలోని కల్లుపల్లి గ్రామంలో శుక్రవారం వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. కల్లుపల్లెకు చెందిన ఇర్ఫాన్, భార్య సహన్‌సేరా (30) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. శుక్రవారం ఇంట్లో సహన్‌సేరా మృతి చెంది ఉండగా గ్రామస్తులు గుర్తించారు. ఆమె భర్త ఆచూకీ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు. భర్తే హతమార్చి పరారయ్యాడని గ్రామస్తులు చెబుతున్నారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఇర్ఫాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

పచ్చ నేతల పగటి వేషాలు

పూతలపట్టు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లేందుకు చేస్తున్న యత్నాలు బెడిసి కొడుతున్నాయి. పచ్చపార్టీ నేతల పగటి వేషాలను చూసి జనం నవ్వుకుంటున్నారు. గతంలో పలుమార్లు బొక్కబోర్లా పడుతున్నా గురువారం మండల సర్వసభ్య సమావేశంలో మరోసారి వేషాలు వేసి 'సోషల్' మీడియా సాక్షిగా అభాసుపాలయ్యారు.

- పచ్చ మీడియాతో కలసి ప్రభుత్వంపై బురదచల్లే యత్నం
- సోషల్ మీడియాలో బయటపడిన కుట్ర ప్రణాళిక
- బొక్కబోర్లాపడిన టీడీపీ నాయకులు
- నిజాలు తెలుసుకుని నవ్వుకున్న జనం


సమావేశంలో భిక్షగాడి వేషంలో వచ్చి ఫొటోలకు ఫోజు ఇస్తున్న టీడీపీ సర్పంచ్ ప్రకాష్ నాయుడు

పూతలపట్టు : పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పథకాలను అందిస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు సైతం వేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీకి జనం నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇది ఓర్వలేని పచ్చ పార్టీ నేతలు జనాన్ని తప్పుదారిపట్టించేందుకు కుట్ర రాజకీయాలకు తెరతీస్తూ అబాసుపాలవుతున్నారు. తాజాగా బంగారుపాళెం మండలంలోనూ నేతలు అవమానాలకు గురయ్యారు. వివరాల్లోకెళితే.. గురువారం సాయంత్రం బంగారుపాళ్యం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అప్పటికే పక్కా ప్లాన్‌తో టీడీపీకి చెందిన 170 గొల్లపల్లె సర్పంచ్ ప్రకాష్‌నాయుడు పచ్చ మీడియాను పిలిపించుకుని చిరిగిన షర్టు ధరించి సమావేశానికి వచ్చారు. 'మా పంచాయతీని అభివృద్ధి చేయలేదంటూ అధికారుల వద్ద భిక్షం ఎత్తుకునేలా యాక్షన్' చేశారు. అంతలోనే పచ్చ మీడియా ప్రతినిధులు దీన్ని ఫొటోలు తీశారు. సమావేశం జరగకుండ ఇబ్బందులకు గురి చేస్తుంటే పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రణాళిక ప్రకారం అక్కడ వేచి ఉన్న జిల్లా, నియోజకవర్గ టీడీపీ నాయకులు 'మా నాయకుడిని పోలీసులు కొట్టారు, బొక్కా చింపేశారు' అంటూ ఓవరాక్షన్ చేసి రోడ్డుపై బైఠాయించారు. ఇదంతా గంట సమయంలో జరిగిపోయింది. దీన్ని పచ్చమీడియా భూతద్దంలో చూపిస్తూ శుక్రవారం కథనం ప్రచురించింది.

గుట్టు విప్పిన సోషల్ మీడియా

'సమావేశానికి చిరిగిన షర్టు వేసుకుని వచ్చి రాద్ధాంతం చేస్తానని..పోలీసులు స్టేషన్‌కు తీసుకొస్తారని.. అక్కడ తాను పడిపోతానని, రహదారిపై ఆందోళన చేసి ప్రభుత్వం పరువు తీయాలని' సర్పంచ్ ప్రకాష్ నాయుడు, టీడీపీ నాయకులు మాట్లాడుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కుట్ర రాజకీయాలు చేసి ప్రభుత్వంపై బురదచల్లే యత్నాల వీడియోలు చూసిన ప్రజలందరూ నవ్వుకున్నారు.

ఎంపీడీఓ ఆదేశాల మేరకే

సర్పంచ్ ప్రకాష్ నాయుడు సమావేశం జరగకుండ అడ్డుపడుతున్నారని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి ఆదేశించడంతోనే అదుపులోకి తీసుకున్నట్లు బంగారుపాళ్యం సీఐ నాగరాజురావు తెలిపారు. అతన్ని స్టేషన్‌కు తరలించే సమయంలో సర్పంచ్ స్పృహ తప్పినట్లు పడిపోవడం, అప్పటికే చేరుకున్న టీడీపీ నాయకులు అతన్ని ఆస్పత్రికి తరలిస్తూ కావాలనే రహదారిలో రాద్ధాంతం చేశారని పేర్కొన్నారు. దీనిపై స్టేషన్ వద్ద ఉన్న సీసీ ఫుటేజీలు చూపించగా టీడీపీ నాయకులు వెళ్లిపోయారని తెలిపారు. నిజానిజాలు తెలుసుకోకుండా టీడీపీ నాయకులు పోలీసులను దూషించడం బాధాకరమన్నారు.

పంచాయతీకి రూ.59.12 కోట్ల లబ్ధి

170 గొల్లపల్లె పంచాయతీకి నాలుగు సంవత్సరాల్లో ప్రభుత్వం రూ.59.12 కోట్ల మేర లబ్ధి చేకూర్చింది. పంచాయతీలో 170 గొల్లపల్లె, 170 గొల్లపల్లె దళితవాడ, ఎర్రాండ్లపల్లె, జయరామాపురం గ్రామాలు ఉన్నాయి. 873 మంది లబ్ధిదారులకు రూ.59.12 కోట్లు వివిధ పథకాల ద్వారా లబ్ధి అందింది. అభివృద్ధి కార్యక్రమాలు సైతం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చొరవతో వేగవంతంగా జరుగుతున్నాయి.